ముంపు బాధితుల గోస!



కొత్త బండరావిపాకుల గ్రామంలో నిలిచిన మురుగు

- కొత్తబండరావిపాకులలో సమస్యల తిష్ట
- సౌకర్యాలు మెరుగుపర్చాలని ప్రజల వేడుకోలు

గోపాల్‌పేట: ఏదుల రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ముంపునకు గురైన బండరావిపాకుల గ్రామస్తులకు ఆర్అండ్ఆర్ సెంటర్‌వద్ద ఇబ్బందులు తప్పడం లేదు. కొత్తబండరావిపాకుల గ్రామంలో సుమారు మూడేళ్ల క్రితం ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు సుమారు ఎనభైశాతం వరకు ఇళ్ల నిర్మాణం చేశారు. కానీ వారికి అధికారులు కనీస సౌకర్యాలు ఇప్పటి వరకు కల్పించలేదు. నివాసం ఉంటున్న ఇండ్ల దగ్గర కరెంటు, డ్రెయినేజీ, తాగునీరు, వాడుకునే నీరు లేకపోవడంతో కొత్తగా ఇళ్లు నిర్మించుకునే బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ముందుచూపు లేకుండా తీసుకున్న నిర్ణయాల వల్ల చేసిన పనే మళ్లీ చేయాల్సి రావడం, వర్షాలు పడితే ఎక్కడికక్కడ నీరు నిలుస్తున్నాయి. దీంతో గ్రామస్తులు పాత బండరావిపాకులలో ఉన్నా, కొత్త బండరావిపాకులలో ఉన్నా తమకు కష్టాలు తప్పవనే ఆలోచనలో ఉన్నారు.

కొత్త బండరావిపాకులలో ప్రస్తుతం ఎస్సీ కాలనీలో కరెంటు స్థంబాలు లేవు. దీంతో కాలనీలో వీధి దీపాలు లేవు. గ్రామంలో డ్రెయినేజీ కాల్వలు తీశారు కానీ, నీరు ఊరిబయటికి వెళ్లేందుకు కాల్వలు తీయలేదు. దీంతో మురుగు ఎక్కడికక్కడ పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు ప్రబలుతున్నా, నివారణకు మందులు పిచికారీ చేయడం లేదు. మహిళలు, చిన్నపిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారు. పరిసరాల్లో గడ్డి పెరిగింది, గడ్డిమందు కొట్టించాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోవడం లేదు. గ్రామానికి ఇంకా 450 ప్లాట్లు ఇవ్వాల్సి ఉంది. గ్రామంలో సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా కొన్నిరోజుల క్రితం ఆర్డీఓ పద్మావతి కొత్త బండరావిపాకుల గ్రామాన్ని సందర్శించారు. అవసరం అయిన వారికి ప్లాట్లు ఇస్తాం, అవసరం లేదనుకుంటే వారికి డబ్బులు చెల్లిస్తాం అని గ్రామస్తులకు చెప్పారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి కొత్త బండరావిపాకులలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కొత్త బండరావిపాకులలో ఎన్నో సమస్యలున్నాయి. అధికారులు చొరవ తీసుకుని కనీస సౌకర్యాలు మంచినీరు, రోడ్లు, డ్రెయినేజీ, కరెంటు ఏర్పాటు చేయించి పాఠశాలలు తొందరగా నిర్మించాలి. గ్రామ అభివృద్ధి కోసం అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పూర్ణకంటి ఉస్సేన్, బండరావిపాకుల

ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్తాం..



బండరావిపాలకు గ్రామస్తుల ప్లాట్ల విషయంలో 12 ఎకరాల అవార్డు గురించి ఎంక్వైరీ చేసేందుకు కొన్నిరోజుల క్రితం ఆర్డీఓ మేడం వచ్చారు. ల్యాండ్ ఓనర్లు మేము ఇవ్వమని చెప్పారు. మేడం దృష్టికి తీసుకెళ్లడంతో సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని మేడం చెప్పారు. గ్రామంలో ఉండే సమస్యలు ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. తప్పకుండా గ్రామస్తుల సమస్యలు తీరుతాయి.

– లక్ష్మీదేవి, తహసీల్దార్, రేవల్లి

క్లుప్తంగా

చెరుకు కట్టెలు జారిపడి వ్యక్తికి గాయాలు



కొత్తకోట రూరల్: కర్నూల్ నుంచి షుగర్ ఫ్యాక్టరీకి చెరుకు తీసుకెళ్తున్న లారీ నుంచి చెరుకు కట్టెలు జారిపడి ద్విచక్రవాహనంపై వెళ్తున్న వనపర్తి జిల్లాకు చెందిన మోహన్‌కు గాయాలైన సంఘటన ఆదివారం ముమ్మళ్లపల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు వెంటనే బాధితున్ని ఆస్పత్రికి తరలించడంతో పెను ప్రమాదం తప్పింది. అప్పరాల సమీపంలో గల కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీకి వెళ్లే రహదారిలో గుంతల కారణంగా కుదుపులు ఏర్పడి చెరుకు లారీ నుంచి కట్టెలు జారిపడ్డాయి. రహదారికి వెంటనే మరమ్మతు చేయాలని అధికారులను, పాలకులను ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

భీమరాయుడి ధ్వజస్తంభం వద్ద పూజలు

అమరచింత: పట్టణంలోని రాంనగర్ కాలనీలో ప్రతిష్ఠించిన భీమరాయుడి ధ్వజస్తంభం వద్ద పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ప్రతి సంవత్సరం భీమరాయుడికి పూజలు నిర్వహించి మొక్కులను చెల్లించుకోవడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ అని కాలనీ వాసులు మాజీ వార్డ్ మెంబర్ శ్రీనివాసులు తెలిపారు. పూజల అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

గణేష్ మండపానికి విరాళాల వెల్లువ




పాన్‌గల్: మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గణేష్ మండప నిర్మాణానికి యాదవులు పెద్ద మొత్తంలో విరాళాలు అందజేస్తున్నట్లు సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం గ్రామానికి చెందిన పలువురు యాదవులు స్వచ్ఛందంగా విరాళాలు అందజేశారు. గ్రామానికి చెందిన లింగాల బాలమ్మ, మశన్నయాదవ్‌ల జ్ఞాపకార్థం వారి కుమారులు రూ.33,333, ఎనుమల నారాయణ జ్ఞాపకార్థం వారి కుమారులు రూ.10 వేలు, గాడ్డుల బాలయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు రూ.10 వేలు, కృష్ణయ్య, రాజేష్ యాదవ్, శివలీల, చిట్యాల రాములు, ఎనుమల సురేష్, జెనిగే నాగశేషిలు ఒక్కొక్కరు రూ.5వేల చొప్పున విరాళాలు అందజేశారు. నిర్మాణానికి విరాళాలు అందజేసిన దాతలకు సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మన్నెం, స్వామి, రాముయాదవ్, స్వామి, రాములు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో మెరిసిన విద్యార్థి



చిన్నంబావి: వరంగల్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్–15 క్రికెట్ పోటీలలో మండలంలోని పెద్దదగడ గ్రామానికి చెందిన ప్రదీప్‌గౌడు ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలలో వనపర్తి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఈ పోటీలలో వనపర్తి జిల్లా జట్టును గెలిపించడమే గాక బెస్ట్ బ్యాట్స్‌మెన్ అవార్డును సైతం దక్కించుకున్నాడు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి గ్రామ మాజీ సర్పంచ్ సురేందర్ సింగ్, మాజీ ఎంపీటీసీ పుష్పావతి, గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు రజినీబాబు, వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు విద్యార్థిని అభినందించారు.

కల్వర్టు మరమ్మతు చేపట్టండి



వీపనగండ్ల: మండల కేంద్రం నుంచి సంగినేనిపల్లి, తూముకుంట గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న కల్వర్టుపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. వెంటనే కల్వర్టుకు మరమ్మతు చేయాల్సి ఉంది. కల్వర్టుపై గుంతల వల్ల పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురైన సంఘటనలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి అవసరమైన మరమ్మతు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీదత్త జయంతి



ఆత్మకూర్‌లో హోమంలో పాల్గొన్న భక్తులు



ఆత్మకూర్‌లో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూర్: ఆత్మకూర్‌లోని సాయిబాబా మందిరం ఆవరణలోని శ్రీ దత్త ఆలయంవద్ద ఆదివారం శ్రీదత్త జయంతి పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కార్యదర్శి దివాన్జీ ప్రభాకర్ రావ్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రకాల పూజలు, దూపహారతి, సాయి భజన, పల్లకీసేవ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతమ్మను సత్కరించారు. వర్తక సంఘం అధ్యక్షుడు ఏపూరి యాదగిరిశెట్టి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంతోష్, రమేష్, నీలేష్, భరత్, ఉదయ్, శివ, నవీన్, ముక్తేశ్వర్ భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కొత్తకోట రూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధకులు పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ 58రోజుల పాటు నిరాహార దీక్ష తర్వాత డిసెంబర్ 15న 1952లో ఆయన మరణించడంతో రాష్ట్రంలో అల్లర్లు చెలరేగాయన్నారు. పొట్టి శ్రీరాములు చేసిన నిరాహార దీక్ష కారణంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, పి.కృష్ణారెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, పెంటన్నయాదవ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి



ఖిల్లాఘనపురంలో వల్లబాయ్‌పటేల్ వర్ధంతి నిర్వహిస్తున్న గోపి తదితరులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో బస్టాండు దగ్గర భారతరత్న, దేశంలో ఉక్కుమనిషిగా పేరు గాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో బస్టాండు దగ్గర ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటేల్ జాతీయోద్యమానికి ఆకర్షితుడై బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా, నాడు మహాత్మాగాంధీ నేతృత్వంలో జరుగుతున్న స్వాతంత్ర్య ఉద్యమంలో పాలుపంచుకోవడం జరిగిందన్నారు. స్వాతంత్ర్యం సాధించిన తరువాత జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలో కేంద్ర హోంశాఖ మంత్రిగా పని చేసినట్లు తెలిపారు. ఆయన కృషి ఫలితంగానే తెలంగాణలోని నిజాంపాలనకు విముక్తి కలిగిందన్నారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు దాసర్ల భూమయ్య, బాబు, ఆశన్న, శివ, విజయ్ కుమార్, శివ శంకర్, భాస్కర్, రాములు, నరేందర్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో జ్ఞానం మెరుగు



మూలమల్లలో త్రైతసిద్ధాంత ప్రభోధ ప్రచారం చేస్తున్న నిర్వహకులు

ఆత్మకూర్: భగవద్గీత పఠనంతో జ్ఞానం వస్తుందని ఆచార్య ప్రబోధనంద యోగీశ్వరులు తెలిపారు. త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో ఆత్మకూర్ మండలంలోని మూలమల్ల గ్రామంలో భగవద్గీత ప్రచార ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య ప్రబోధనంద యోగీశ్వరుల సందేశాలను, భగవద్గీత శ్లోకాలను వినిపించారు త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రాంథాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో పెబ్బేరు, కొత్తకోట, మదిగట్ల ప్రబోధసేవాసమితి నిర్వహకులు రాఘవేంద్రాచారి, రవి, యాది, మనోహర్, మంజుల, సబిత, సుదర్శన్, బాలరాజు, ఆంజనేయులు, ఉమా రాణి, లావణ్య, స్వప్న, కాలమ్మ, సువర్ణ, భాగ్య, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రయ్య భక్తులు పాల్గొన్నారు.

నేడు మహబూబ్ ఉస్సేని దర్గా ఉర్సు



అమరచింత: మండలంలోని ఈర్లదిన్నె గ్రామంలో సోమవారం మహబూబ్ హుస్సేని దర్గా షరీఫ్ ఉర్సు నిర్వహిస్తున్నట్లు నిర్వహకుడు ఖతాల్ తెలిపారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ నెలలో మహబూబ్ ఉస్సేని ఉర్సోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు కలిసిమెలిసి దర్గా షరీఫ్‌లో ప్రార్థనలు చేసి కందూరు నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆనవాయితిగా పేర్కొన్నారు. ఆదివారం గంధోత్సవంతో ఉత్సవాలు ప్రారంభమైనట్లు తెలిపారు. సోమవారం ఉర్సు ను గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ఆత్మకూర్‌లో పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

ఆత్మకూర్: పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఆత్మకూర్‌లోని జాతర మైదానం బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. 1996–97 పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వవిద్యార్థులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాఠాలు బోధించిన గురువులను సత్కరించారు, కార్యక్రమంలో జగదీష్, అజ్మతుల్లా, శ్రీను, జహంగీర్, హరి, లక్ష్మీకాంత్, ఆసీఫ్, శేఖర్, రామకృష్ణ, నర్సింహ, రవి, ముజీబ్ ఉన్నారు.

ప్రమాదకర స్తంభాలను మార్చాలి



వీపనగండ్ల: మండలంలోని బొల్లారం గ్రామంలో విద్యుత్ అధికారులు చెరువుకట్టపై ఉన్న రోడ్డుపై ఎన్నో నెలలుగా విద్యుత్ స్తంభాలను ఉంచారు. దీంతో ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఆ రహదారిలో రెండు విద్యుత్ స్తంభాలను ఉంచిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మరో చోటికి మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అసంపూర్తి రోడ్డుతో ఇబ్బందులు



బీటీకి నోచుకొని అసంపూర్తి రోడ్డు

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి క్రాస్ రోడ్డు నుంచి మంగళ్లపల్లి, ఆకునోనిపల్లె, ఆకునోనిపల్లెతండా, దావాత్‌ఖాన్‌పల్లి గ్రామాల మీదుగా ఉన్న 7.5 కిలో మీటర్ల పీఆర్ రోడ్డును రూ.4 కోట్ల నిధులతో బీటీగా మార్చేందుకు 2018 ఏప్రిల్ 13న అప్పటి ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి ఐదేళ్లు గడిచినా కేవలం రెండు కిలోమీటర్ల మేర మాత్రమే బీటీగా మార్చి మిగతా రోడ్డుకు కంకర వేసి వదిలేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రవాణా పరంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీటీగా మారితే తమ గ్రామాలకు రవాణా ఇబ్బందులు తొలగి ఆర్టీసీ బస్సులు వస్తుందనుకున్న ప్రజలకు నిరాశే మిగిలింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్డును త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డంపింగ్‌యార్డులో నిత్యం పొగ



తగులబడి పొగలు కక్కుతున్న డంపింగ్‌యార్డు

అమరచింత: పట్టణంలోని కొత్తతండా సమీపంలో పాడుబడిన బావిలో డంపింగ్ యార్డు పేరిట చెత్త చెదారం వేస్తూ తగుల బెడుతున్నారు. దీంతో నిత్యం దుర్వాసనతో కూడిన పొగ వల్ల శ్రీకృష్ణ నగర్ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో డంపింగ్‌యాడ్‌ను విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అక్కడి నుంచి కొత్తతండా సమీపంలోని పాడుబావుల్లో చెత్త వేస్తున్నారు. చెత్తను తగుల బెట్టడంతో మద్దూరు రహదారిపై చిన్నచింతకుంటకు వెళ్తున్న ప్రయాణికులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మస్తీపురం గ్రామ శివారులో ఏర్పాటు చేసిన డంపింగ్ యాడ్‌కు పట్టణంలో సేకరించిన చెత్తను తరలించాలని కోరుతున్నారు.

శ్రీవారి సేవలో శాంతినగర్ భక్తులు

శాంతినగర్: కలియుగ ప్రత్యక్ష దైవం ఏడుకొండల స్వామి వారి సేవకు శాంతినగర్ నుంచి భక్తులు తరలివెళ్లారు. శ్రీవారి సేవకులు గాయత్రి శ్రీనివాసులు ఆధ్వర్యంలో 20 మంది భక్తులు ఆదివారం తిరుమలకు చేరుకున్నారు. మార్గశిర పౌర్ణమి పర్వదినం సందర్భంగా విష్ణు సహస్ర నామాల పారాయణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.

నేడు సిర్సనగండ్లలో ధనుర్మాస మహోత్సవం

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రాస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ దేరం రామశర్మ తెలిపారు. సోమవారం త్రిదండి దేవనాథ రామనుజజీయర్ స్వామి హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కాలనీల్లో చెత్తాచెదారం



పాన్‌గల్ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో చెత్తకుప్పలు

పాన్‌గల్: పేరుకే మండల కేంద్రం పలు కాలనీల్లో చెత్త పేరుకుపోయి పారిశుద్ధ్యం లోపించింది. వారానికి రెండు సార్లు డ్రై డేలు నిర్వహిస్తున్నా, పారిశుద్ధ్య నివారణ చర్యలు బాగుపడటంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో పారిశుద్ధ్య నివారణ చర్యలు చేపట్టి కుప్పలుగా పోసిన చెత్తను తొలగించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. దీంతో తొలగించిన చెత్త కుప్పలు మళ్లీ మురుగు కాల్వలో చేరుతున్నాయి. పోగు చేసిన చెత్తను చెత్త ట్రాక్టర్లల్లో వేద్దామన్నా కాలనీలకు ట్రాక్టర్ రాకపోవడంతో కాలనీలోనే వేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ సిబ్బంది స్పందించి కాలనీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పిల్లర్లకే పరిమితమైన డైనింగ్‌హాల్



అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో మన ఊరు–మనబడి ద్వారా గత ప్రభుత్వం డైనింగ్‌హాల్ కోసం నిధులు మంజూరు చేసినా, ఇప్పటి వరకు పనులు అసంపూర్తిగానే మిగిలాయి. గత ప్రభుత్వ హయాంలో పిల్లర్ల వరకు డైనింగ్‌హాల్ నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడం, ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో డైనింగ్‌హాల్ నిర్మాణ పనులు మరుగున పడ్డాయి. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట మరమ్మతులతో పాటు నిర్మాణం కోసం పాఠశాలలకు నిధులు మంజూరు చేసింది. కాని అసంపూర్తిగా ఉన్న డైనింగ్‌హాల్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయలేదు. పాఠశాలలో సుమారు 380 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో ఆరుబయట నిలబడి భోజనం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఎమ్మెల్యే, అధికారులు స్పందించి డైనింగ్‌హాల్ కోసం నిధులు మంజూరు చేయాలని పాఠశాల విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కోరుతున్నారు.

బీటీరోడ్డు శంకుస్థాపనకే పరిమితం

- రూ.4.70 కోట్లు మంజూరైనా నిర్లక్ష్యమే..
- మూడేళ్లుగా ముందుకుసాగని అప్పారెడ్డిపల్లి, ఆముదంబండ తండా రోడ్డు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, పట్టించుకోని అధికారులు



పర్వతాపురం మట్టి రోడ్డు

ఖిల్లాఘనపురం: మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి ఆముదంబండ తండా వరకు బీటీ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. టెండర్ తీసుకున్న కాంట్రాక్టర్ మూడేళ్లుగా పనులు పనులు ప్రారంభించకపోవడంతో పలు గ్రామాలు, గిరిజన తండాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌తో వెంటనే పనులు చేయించాలని వారు కోరుతున్నారు.

రూ.4.70 కోట్లు మంజూరు..

మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి పర్వతాపురం, గార్లబండతండా మీదుగా బీటీ రోడ్డు నిర్మాణానికి నాటి వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అధికారులతో సర్వే చేయించి నివేదికను ప్రభుత్వానికి పంపించారు. దీంతో పీఎంజీఎస్‌వై పథకం ద్వారా రూ.4.70 కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండరు ప్రక్రియ పూర్తి అయిన తరువాత కాంట్రాక్టర్ పనులు చేపట్టకుండా తాత్సారం చేస్తున్నాడు. ఇప్పటికైనా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు గ్రామాలు, నాలుగు గిరిజన తండాలు..



మూడేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన శిలాఫలకం

అప్పారెడ్డిపల్లి నుంచి ఆముదంబండ తండా వరకు 7.3 కిలోమీటర్లు బీటీ నిర్మాణంతో పాటుగా మార్గమధ్యలో పర్వతాపురం శివారులో ప్రత్యేకంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నిధులు మంజూరయ్యాయి. నాటి మంత్రి నిరంజన్‌రెడ్డి పనులకు 2021 జూన్ 8న శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ మాత్రం ఇప్పటికి పనులు చేపట్టడంలేదు. పర్వతాపురం శివారులో కొంతదూరం రోడ్డుకు ఇరువైపులా చెట్లను తొగించి వదిలేశాడు. ఈ రోడ్డు పూర్తయితే అప్పారెడ్డిపల్లి, పర్వతాపురం, షాపురం ఊరంచు తండా, ఆముదంబండ తండా, కోతులకుంట తండా, కర్నెతండా ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

చెట్లు తొలగించి వదిలేశారు..



అప్పారెడ్డిపల్లి నుంచి మా గ్రామం మీదుగా ఆముదం బండ తండా వరకు బీటీ రోడ్డుకు నిధులు మంజూరైనట్లు మూడేళ్ల క్రితం చెప్పారు. కాంట్రాక్టర్ ఇటీవల మా గ్రామ శివారులో కొంత దూరం రోడ్డుకు ఇరువైపులా చెట్లు తొలిగించాడు. తరువాత ప నులు చేపట్టలేదు.

– గోవర్ధన్‌రెడ్డి, పర్వతాపురం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

ఖిల్లాఘనపురం మండంలోని అప్పారెడ్డిపల్లి నుంచి వయా పర్వతాపురం గ్రామం మీదుగా చేపట్టే రోడ్డు పనులు సాగడం లేదు. పర్వతాపురం శివారులో కొంత మేరకు మట్టి రోడ్డుకు ఇరువైపులా చెట్లను తొలిగించారు. రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదనే విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

– రమేష్‌నాయుడు, పంచాయతీరాజ్ ఏఈ

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
వనపర్తి | ఎ. గణేష్ కుమార్ | - 91605 62261
కొత్తకోట / పెబ్బేర్ | ఇ. రాజశేఖర్ గౌడ్ | - 97000 09392
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

యాడ్స్ మేనేజర్
9951602829
జబ్బర్ లాల్ : 9553955603